## 'డిచ్‌పల్లి ఎంపీపీని గద్దె దించుతాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ నర్సయ్య

డిచ్‌పల్లి, జనవరి 29 : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమయ్యను త్వరలోనే గద్దె దింపుతామని మండలంలోని 13 మంది ఎంపీటీసీలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నడిపల్లి–2 ఎంపీటీసీ చిన్నోళ్ల నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. అవిశ్వాస సమావేశంలో ఓటమి చవిచూస్తాననే భయంతోనే ఎంపీపీ ముందస్తుగా హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తీసుకొని, సమావేశం జరగకుండా ఆపాడని విమర్శించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని విమర్శించే స్థాయి ఎంపీపీకి లేదన్నారు. ఎంపీటీసీలు చేసిన పనులకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతోనే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందని తెలిపారు. వీలైనంత త్వరలో స్టే ఎత్తివేయించి అవిశ్వాసాన్ని గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు దండుగుల సాయిలు, ఉగ్గెర కృష్ణవేణి, పులి నర్సింగ్‌రావు, చాకటి రాజమణి, కుర్రి సవిత, దుంపాల సౌమ్య, గండోళ్ల సుప్రియ, బాల గంగాధర్, పోతర్ల సుజాత, రాథోడ్ బిక్యా, సాంపల్లి గోదావరి, అప్పాల మంజుల పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

ఆర్మూర్‌టౌన్, జనవరి29: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వచ్చేనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ నాయకుడు దాసు కోరారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు జి.సూర్య శివాజి, ఎండీ కాజా మొహినుద్దీన్, బాలయ్య మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.



**వసుంధర** డైమండ్స్ అండ్ జ్యువెల్లర్స్ ఎగ్జిబిషన్‌ను నగరంలోని వంశీ హోటల్‌లో సోమవారం ప్రారంభించారు. నేడు (మంగళవారం) ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.
– ఖలీల్‌వాడి, జనవరి 29

# 'ప్రజావాణి'కి 61 దరఖాస్తులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 29 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, జడ్పీసీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

**వృద్ధులు, దివ్యాంగులకు తప్పనితిప్పలు..**

ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందజేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకే వీల్‌చైర్ ఉండడంతో ఎక్కువసేపు బయటే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. వీల్‌చైర్స్ అందుబాటులో లేకపోవడంతో చివరికి కష్టంగా నడుచుకుంటూ అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు బస్సులో వచ్చిన బెజ్జోరా గ్రామస్తులు

## మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు ఇప్పించండి

● పెగడపల్లి, భూలక్ష్మి క్యాంప్ రైతుల వినతి



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పెగడాపల్లి, భూలక్ష్మి క్యాంప్ రైతులు

బోధన్ – బాసర– భైంసా రోడ్డు విస్తరణలో భాగంగా తాము భూములను కోల్పోయామని, వ్యవసాయ భూములకు చాలా తక్కువ డబ్బులు చెల్లించారని పెగడాపల్లి, భూలక్ష్మి క్యాంప్ రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. భూములకు మార్కెట్ విలువ ఎక్కువ ఉన్నందున, అధికారులు భూములను పరిశీలించి మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు ఇప్పించాలని కోరారు.

## 'మా ఇండ్ల స్థలాలు మాకు ఇప్పించండి'

● బెజ్జోర గ్రామస్తుల వినతి

తమ ఇండ్ల స్థలాలు తమకు ఇప్పించాలని కోరుతూ భీంగల్ మండలం బెజ్జోర గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2002లో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తమ గ్రామానికి వచ్చి ఇండ్లు లేని 365 పేదవారికి ఇండ్ల పట్టాలు అందజేశారని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉన్న కొందరు ఇండ్లు నిర్మించుకోగా.. మిగిలిన వారు అలాగే ఉండిపోయారని పేర్కొన్నారు. ఆ స్థలాలను కొందరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, తమ ఇండ్ల స్థలాలు తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

## క్రీడాకారులకు అభినందన

కంఠేశ్వర్, జనవరి 29 : గోవాలో ఇటీవల నిర్వహించిన రెండో నేషనల్ యూత్ గేమ్స్ –2024లో మునిపల్లిలోని మహాత్మాజ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. వాలీబాల్, ఖోఖోలో ప్రథమస్థానంలో నిలిచి.. బంగారు పతకాలు సాధించారు. టీయూ నుంచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ మెయిన్ ఉషూ ఉమెన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు విద్యార్థిని గౌరీబాయి ఎంపికైనట్లు తెలిపారు.

విద్యార్థులను కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో జ్యోతిబాపూలే రీజినల్ కో–ఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనాథ్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## రెండో రోజు కొనసాగిన బీఆర్ఎస్ నాయకుల దీక్ష



రిలే దీక్ష చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, జనవరి29: మున్సిపల్ వైస్ చైర్మన్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించాలని కోరుతూ వైస్ చైర్మన్ షేక్ మున్నాతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం రెండో రోజుకు చేరింది. కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినందున తిరిగి బల పరీక్ష చేపట్టే వరకు వైస్ చైర్మన్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జహీర్ అలీ, ఫయాజ్, సయ్యద్ అతిక్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

ఇందల్వాయి, జనవరి 29 : మండలంలోని మెగ్యానాయక్ తండాకు చెందిన శ్రీనాథ్ (16) సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకలు మేపేందుకు వెళ్లిన శ్రీనాథ్.. నల్లవెల్లి శివారులోని తిరుమలయ్య చెరువులో చేపలు పట్టేందుకు దిగాడు. ఈతరాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసేందుకు యత్నిస్తున్నారు. మృతుడికి ఒక అన్న ఉన్నాడు.

## విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు

కోటగిరి, జనవరి 29 : అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో ఆరోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులకు సోమవారం రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఆర్ఎస్‌బీకే డాక్టర్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో 83 మంది విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న 9 మంది విద్యార్థులకు దవాఖానకు రిఫర్ చేశామన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహారంతోపాటు వంట సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్లు జ్యోతి, ఏఎన్ఎంలు శ్రీదేవి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఏర్గట్ల, జనవరి 29: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారిణి ప్రసన్నప్రియ, ఆరోగ్య పర్యవేక్షకుడు ఆకుల మారుతీ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో అనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త హీనతతో బాధపడుతున్న బాలికలకు ఐరన్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సుంకరి సంధ్య, ఫార్మాసిస్టు బొమ్మ అరుణ్‌గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటేలో ముప్కాల్ కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేజీబీవీ ఎస్‌వో వినోద

ముప్కాల్, జనవరి 29: ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించిన మూడో నేషనల్ లెవెల్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో ముప్కాల్ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చూపారని పాఠశాల ఎస్‌వో ఆర్.వినోద సోమవారం తెలిపారు. అండర్ 12 కటఫ్ విభాగంలో ఎం.మహేశ్వరి, ఆర్.హర్షవర్ధిని, జీ.రష్మిత, ఎస్.శృతి, కీర్తి, శాలిని గోల్డ్ మెడల్స్ సాధించారని అన్నారు. అండర్ –12 విభాగంలో ఎస్.శివనందిని, బి.అఖిల, ఎస.దివ్యశ్రీ, సీహెచ్.అస్మిత, ఎస్.ఆరాధ్య, ఐ.మనస్విని సిల్వర్ మెడల్స్‌ను సాధించారని తెలిపారు. టి.రస్మిత, యూ.వర్ష, పి.రజిని, ఎస్.శ్రీజ, బి.శ్రీనిత్య బ్రాంజ్ మెడల్స్ గెలుపొందినట్లు వెల్లడించారు. ఓవరల్ చాంపియన్‌షిప్ కప్‌ను గెలుచుకున్నారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ట్రస్మా ఇండియా చీఫ్ సత్యశంకర్, సంతోష్ మాస్టర్, శ్రీకాంత్ మాస్టర్, ఆర్గనైజర్ కె.రవి ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం పాఠశాల ఆవరణలో పీఈటీ ప్రమీలతోపాటు క్రీడాకారులను స్పెషల్ ఆఫీసర్ అభినందించారు.

## ఎన్‌వైకే సలహామండలి జిల్లా సభ్యుడిగా వెంకటేశ్

శక్కర్‌నగర్, జనవరి 29: జిల్లా నెహ్రూ యువ కేంద్ర సలహా మండలి సభ్యుడిగా బోధన్‌కు చెందిన పెర్క వెంకటేశ్ ఎన్నికయ్యారు. జిల్లాలో యువజన సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని, క్రీడలు, సామాజిక సేవలో యువత పాల్గొనే విధంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తానని, జిల్లాలో యువకులు దేశభక్తి భావంతో కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## పోలీసు సిబ్బంది ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలి

వార్షిక మొబెలైజేషన్‌లో సీపీ కల్మేశ్వర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, జనవరి 29 : పోలీస్ సిబ్బంది ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. నగరంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో వార్షిక మొబెలైజేషన్ –2024 శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఫిజికల్ ఎక్సర్సైజ్, యోగా, స్క్వాడ్ డ్రిల్, ఆమ్స్ డ్రిల్, ప్లాటూన్ డ్రిల్, లాఠీ డ్రిల్, వీఐపీ ఎస్కార్ట్స్, మాబ్ ఆపరేషన్ డ్రిల్‌తో పాటు ఆయుధాలపై అవగాహన, ఫైరింగ్ ప్రాక్టీస్ తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. సాయంత్రం స్పోర్ట్స్ నిర్వహిస్తామని చెప్పారు. సిబ్బంది పాజిటివ్‌గా ఆలోచించాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ గిరిరాజు, ప్రొబేషనరీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, హోంగార్డ్ ఏసీపీ అరుణ్ కుమార్, ఆర్ఐ శ్రీపాల్, శ్రీనివాస్, తిరుపతి, రమేశ్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

రుద్రూర్, జనవరి 29 : మండలకేంద్రంలో పెంపుడు కుక్కకు పశువైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం యాంటీ రేబిస్ టీకాలు వేశారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా 19 కుక్కలకు వ్యాక్సిన్లు వేశామని, డాక్టర్ సంతోష్ తెలిపారు. పశువైద్యశాలలో ఈనెల 30న కూడా టీకాలు వేస్తామని తెలిపారు.

## మండల స్థాయీ సంఘ సమావేశం

మోపాల్ (ఖలీల్‌వాడి), జనవరి 29 : మోపాల్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండల స్థాయీ సంఘ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ లతాకన్నేరాం హాజరై మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో వారిని సన్మానించారు.

## నగరంలో నిధి ఆప్‌కే నిఖత్ 2.0

ఖలీల్‌వాడి, జనవరి 29 : నగరంలోని వెంకటేశ్వర మోటర్స్‌లో నిధి ఆప్‌కే నిఖత్ 2.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రావు హాజరై మాట్లాడారు. పీఎఫ్ చందాదారులు, పెన్షన్‌దారుల సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా వెంట వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈపీఎఫ్‌వో సంస్థల్లో వివిధ ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఎఫ్ అధికారులు శ్రావణ్ కుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



**పండరీపూర్** పుణ్యక్షేత్రంలో అఖిల సాధు పరిషత్ 58వ మహాసభలు కొనసాగుతున్నాయి. సభల్లో మంగిరాములు మహరాజ్ పాల్గొన్నారు.
– నందిపేట్, జనవరి 29

## యువజన వారోత్సవాల ముగింపు సభ

కంఠేశ్వర్, జనవరి 29 : స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతుల సందర్భంగా ఏబీవీపీ– ఇందూరు శాఖ ఆధ్వర్యంలో యువజన వారోత్సవాలను ఈ నెల 29, 20న నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ముగింపు సభను నగరంలోని అంబేద్కర్‌భవన్‌లో సోమవారం నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ, పూర్వ రాష్ట్రఅధ్యక్షుడు రెంజర్ల నరేశ్ హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉంటాం : రూరల్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి 29 : ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పనిచేస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని కలిగోట్ గ్రామంలో ఉన్న పుట్ట శివాలయంలో సోమవారం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అర్హులకు అందేలా చూస్తామని, గ్రామంలో 133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని వీడీసీ సభ్యులు విన్నవించగా.. పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, సర్పంచ్ చేతనా విజయ్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాయికరాజు, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షిప్తంగా..

- ముప్కాల్, జనవరి 29: ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి దామోదర్ సోమవారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.
- నందిపేట్, జనవరి 29: మండల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జర్నలిస్ట్ నరేందర్ 33వ వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. 33 ఏండ్ల క్రితం రాడికల్స్, పోలీసుల మధ్య జరిగిన కాల్పుల్లో ఆయన మృతి చెందాడని తెలిపారు. కార్యక్రమంలో కె.గంగాధర్, రాజలింగం, అనంత్‌రావు, గంగాధర్, దేవన్న, రాజమణి, స్వప్న, లత పాల్గొన్నారు.
- మాక్లూర్, జనవరి29: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇంటి పన్నులు, నల్లా పన్నులు సకాలంలో చెల్లించాలని ఎంపీవో శ్రీనివాస్ కోరారు. గ్రామాల్లో కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేయాలని సూచించారు.
- మోర్తాడ్, జనవరి 29: మోర్తాడ్‌లో సోమవారం పీఆర్టీయూ నూతన సంవత్సర డైరీని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మగ్గిడి ప్రవీణ్, ప్రగత్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.
- ఆర్మూర్‌టౌన్, జనవరి29: పట్టణంలోని పోచమ్మగల్లీలో ఉన్న ఏరియా వెటర్నరీ దవాఖానలో సోమవారం కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేసినట్లు అసిస్టెంట్ డాక్టర్ జియాదుద్దీన్ అన్నారు. రేబిస్ వ్యాధి లక్షణాలను జంతు ప్రేమికులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లేశ్, శోభ పాల్గొన్నారు.
- రెంజల్, జనవరి 29: రెంజల్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రెంజల్, సాటాపూర్, బోర్గాం, తాడ్‌బిలోలి, మౌలాలీ తండా, వీరన్నగుట్ట, అంబేద్కర్‌నగర్ గ్రామాల అధ్యక్ష ఎన్నిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సత్యనారాయణరావు సోమవారం తెలిపారు. నోటిఫికేషన్‌ను ఈనెల 25న జారీ చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5:30 గంటలకు కౌంటింగ్ పూర్తి కాగానే ఎన్నికైన అభ్యర్థి పేరును ప్రకటిస్తామని వెల్లడించారు.
- ఎడపల్లి, జనవరి 29: శాటాపూర్ గేట్, ఏఆర్పీ క్యాంపు మధ్యన దుబ్బతండా గ్రామ సమీపంలో ఉన్న ఇసుక డంప్‌ను సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. సుమారు మూడు టిప్పర్ల ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేశారు. పోలీసులకు ఫిర్యాదు రావడంతో ఇసుక డంపును సీజ్ చేశారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజు, ఎస్సై విక్రం, రెవెన్యు ఇన్‌స్పెక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.
- ఆర్మూర్‌టౌన్, జనవరి29: గణతంత్ర దినోత్సవం రోజు ఉత్తమ అవార్డు అందుకున్న ఆలూర్ తహసీల్దార్ నరేశ్‌ను తహసీల్ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఫీక్ పాషా, వెల్మ గంగారెడ్డి, లైన్‌మన్ శివకుమార్, ఇస్సాపల్లి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- శక్కర్‌నగర్, జనవరి 29: బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్‌ను సోమవారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సన్మానించారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా సన్మానించినట్లు వారు తెలిపారు.

## స్నేహితుడికి ఆర్థిక సహాయం

చందూర్, జనవరి 29 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సాయిలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడన్న విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. 1990 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు రూ.20 వేలు జమ చేసి సాయిలుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంజీవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి

## దూర ప్రాంతాల ప్రయాణికుల కోసం 'లహరి' బస్సులు

బోధన్/బోధన్ రూరల్/శక్కర్‌నగర్, జనవరి 29: దూర ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం లహరి బస్సులను ప్రారంభిస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ ఆర్టీసీ డిపోనకు మంజూరైన నాలుగు 'లహరి' బస్సులకు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సుల్లో 15 స్లీపర్ సీట్లు, 30 మామూలు సీట్లు ఉంటాయని, ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. దూర ప్రాంతాలకు నడిపే బస్సులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. బోధన్ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫారాలతోపాటు, ప్రయాణికులకు ఉన్న వసతులను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, శంకర్, బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఆర్డీవో రాజా గౌడ్, ఏసీపీ కేఎం కిరణ్ కుమార్, తహసీల్దార్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

బోధన్ మండలంలోని సంగం, బండార్‌పల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ భవనాలను బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ కల్లురి అంజవ్వా గంగారెడ్డి, ఉపసర్పంచ్ శంకర్, బోధన్ ఎంపీపీ బుద్దెసావిత్రీరాజేశ్వర్, జడ్పీటీసీ గిర్దావర్ లక్ష్మి గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి ఉన్నారు.

బోధన్ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలతో పాటు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ పట్టణం ఆచన్‌పల్లి శివారులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్మించనున్న గోదాం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు ఉద్మీర్ లక్ష్మణ్, కార్యదర్శి ఉమాకాంత్ కులకర్ణి, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, పెద్దిరెడ్డి, తూము శరత్ రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్ల రామ్మోహన్, బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత సహకారంతో గ్రామాభివృద్ధి



రాంపూర్ సర్పంచ్ దొంత రుతు కల్పనా ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవీపేట, జనవరి 29: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్ సహకారంతో రాంపూర్ గ్రామాన్ని రూ.1.50 కోట్ల వ్యయంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ దొంత రుతు కల్పనా ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాంపూర్‌లో ఎంపీటీసీ గైని లావణ్యా మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు సర్పంచ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సహకారంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. మహిళా భవనం, గోసంగి సంఘం ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించామని అన్నారు. రూ.13 కోట్లతో నవీపేట నుంచి తాడ్‌బిలోలి డబుల్ బీటీ రోడ్డు మంజూరైందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించనున్నట్లు సర్పంచు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు తెడ్డు పోశెట్టి హాజరై మాట్లాడారు. సర్పంచ్‌తోపాటు జీపీ పాలకవర్గాన్ని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గైని లావణ్యా మోహన్, మండల స్పెషల్ ఆఫీసర్ రతన్, జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్, జీపీ కోఆప్షన్ మెంబర్ గంగాధర్, మోకన్‌పల్లి ఎంపీటీసీ బేగరి జనార్దన్, బీఆర్ఎస్ నాయకులు ఈర్నాల గంగాధర్, జనార్దన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలని ఆందోళన

ఆర్మూర్‌టౌన్, జనవరి29: వైద్యులు అందుబాటులో ఉండాలని పట్టణంలోని పోచమ్మకాలనీలో ఉన్న వెటర్నరీ దవాఖానలో రైతులు ఆందోళనకు సోమవారం దిగారు. రైతులు మాట్లాడుతూ పశువులకు సరైన సమయంలో వైద్యం అందక మృతి చెందుతున్నాయని అన్నారు. మందులు అందుబాటులో లేక ప్రైవేట్ మెడికల్‌కు వెళ్లాల్సి వస్తున్నదని అసిస్టెంట్ వెటర్నరీ డాక్టర్ జియావుద్దీన్‌తో వాగ్వాదానికి దిగారు. రైతులకు సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు.